క్రీడలతో ఐక్యతాభావం పెంపు : ఎస్పీ

క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

గరిడేపల్లి, ఫిబ్రవరి 19 : క్రీడలతో ఐక్యతాభావం పెంపొందుతుందని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. మండలంలోని గడ్డిపల్లిలో అరవింద మాత ధ్యాన మందిరం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మహిళా ఇన్విటేషన్ టీమ్స్ కబడ్డీ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో జాతీయ మహిళా ఇన్విటేషన్స్ టీమ్స్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగేశ్వర్‌రావు, కరుణాకర్, ఎంపీటీసీ శోభన్ బాబు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు భూలోకరావు, రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఇంటర్నల్ మూల్యాంకనం పరిశీలన

అంతర్గత మార్కులను పరిశీలిస్తున్న మానిటరింగ్ బృందం

నూతనకల్/మద్దిరాల, ఫిబ్రవరి 19 : పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మూల్యాంకన మార్కులను మానిటరింగ్ బృందం సోమవారం నూతనకల్ మండలం వెంకేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దిరాల మండలంలోని చిననెమిల హైస్కూల్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా మానిటరింగ్ బృందం సబ్జెక్ట్‌ల వారీగా 20 మార్కులకు వేసిన రిజిస్టర్లు, రికార్డులు, ప్రాజెక్ట్ వర్క్‌కు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారులు శివయ్య, శ్రీనివాస్, సభ్యులు బాసిత్‌అలీ, బోసుబాబు, షాబుద్దీన్, వెంకన్న, సోమయ్య, యాకయ్య, రమేశ్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, ఫిబ్రవరి 19 : మార్చి 3న చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి పల్స్ పోలియోపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 475 గ్రామ పంచాయతీలు, 5 మున్సిపాలిటీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు 92,965 మంది ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం 774 బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. అన్ని అనుబంధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి కార్యక్రమం నిర్వహించాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలంతోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సూర్యాపేట : పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించే పరీక్షల కోసం ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 345 పాఠశాలల్లో రెగ్యులర్ విద్యార్థులు 11,945 మంది, ప్రైవేట్ విద్యార్థులు 187 మందితో కలిపి మొత్తం 12,133 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాను 25 జోన్లుగా విభజన చేసి నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించనున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు అప్పారావు, మధుసూదనరాజు, శ్రీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు తప్పక హాజరుకావాలి

సూర్యాపేట : ప్రజావాణి కార్యక్రమానికి మండల, జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధికారులు మండల కేంద్రంలో, జిల్లా అధికారులు జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణిలో పాల్గొని అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎఫ్‌ఓ సతీశ్‌కుమార్, డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీటీడీఓ శంకర్, డీఎంహెచ్‌వో కోటాచలం పాల్గొన్నారు.

నేడు బుర్కచర్లకు ఎమ్మెల్సీ కవిత రాక

మోతె, ఫిబ్రవరి 19 : మండలంలోని బుర్కచర్ల గ్రామానికి మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన ఇరుగు అస్మిత ఇమాంపేట ఎస్సీ గురుకులంలో పదో తరగతి చదువుతూ ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎమ్మెల్సీ కవిత రానున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినుల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హస్సేన్

బొడ్రాయిబజార్ : కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 19 : గత 20 రోజుల్లో భువనగిరి యాదాద్రి జిల్లాతోపాటు సూర్యాపేట జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నలుగురు విద్యార్థినుల ఆత్మహత్యలకు పాల్పడడంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హస్సేన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బోడ శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థినుల మృతిపై ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించడపోవడం దారుణమన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బోయిళ్ల అఖిల్, లంబాడి హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేందర్ నాయక్, ఉద్యోగ సంఘం నాయకులు దయానంద్, మాల న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు స్టాలిన్, రామకృష్ణ, మల్లేశ్, కల్యాణ్ పాల్గొన్నారు.

మోతె : విద్యార్థినుల మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం విచారకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రేణుక

బీఆర్‌ఎస్ బీమా చెక్కు అందజేత

అర్వపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని కుంచమర్తికి చెందిన మహంకాళి వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను బీఆర్‌ఎస్ ప్రమాద బీమా కలిగి ఉండడంతో సోమవారం రూ.2 లక్షల చెక్కును ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అలుగుబెల్లి భాస్కర్‌రెడ్డి, ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.

కారు బోల్తా..మహిళ మృతి

కోదాడ రూరల్, ఫిబ్రవరి19 : కారు బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని విజయవాడకు చెందిన జక్కుల సోమ్లా తన భార్య రమాదేవి(45) కూతురు, కుమారుడితో కలిసి అత్తగారి ఊరు మంచిర్యాలకు వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో కోదాడ మండలం దొరకుంట శివారులో కారు బోల్తాపడింది. ఘటనలో రమాదేవి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరుడు నర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ ఇస్మాయిల్ తెలిపారు.

బాలుడిని చితకబాదిన ఘటనపై విచారణ

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19 : బూరుగడ్డ ప్రాథమిక పాఠశాలలో లెక్కలు రావడం లేదని బాలుడిని చితకబాదిన ఘటనపై విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ సోమవారం పాఠశాలలో ఎంఈవో సైదానాయక్‌తో కలిసి పాఠశాలలో విచారణ చేపట్టారు. వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు డీఈఓ తెలిపారు. ఉపాధ్యాయులు సానుకూల పద్ధతిలో పాఠాలు బోధించాలని సూచించారు.

రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా గృహజ్యోతి అమలు చేయాలి

- బీఆర్‌ఎస్ నాయకుడు రవినాయక్

పాలకవీడు, ఫిబ్రవరి19 : రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రవి నాయక్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గృహజ్యోతి పథకానికి రేషన్‌కార్డు నిబంధనలతో గ్రామాల్లో ఎన్నో పేద కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ అధికారులు ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి గ్రామాల్లో అర్హుల వివరాలను సేకరిస్తున్నారని, రేషన్ కార్డు లేకుంటే అర్హులు కాదని తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు అందరికీ ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని పొనుగోడు పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులపై దాడికి మోదీ బాధ్యత వహించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 19 : కనీస మద్దతు ధర చట్టం కోసం దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం దారుణంగా అణిచివేయడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల పొట్ట కొట్టే విధానాలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, రుణమాఫీ అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

బరాఖత్‌గూడెంలో వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు షురూ

మునగాల, ఫిబ్రవరి 19 : మండలంలోని బరాఖత్‌గూడెంలో వెంటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి తొళక్కంతో ప్రారంభమయ్యాయి. స్వామివారు స్వయంభువుగా వెలసిన ఈ ఆలయంలో ప్రతియేటా మాఘశుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలు, స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ, బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20న అధ్యయనోత్సవం, 21న పరమ పథోత్సవం, 22న అంకురార్పణ, 23న హోమం, 24న స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.

అల్పాహారానికి చేయూత

నేరేడుచర్ల , ఫిబ్రవరి19 : మండలంలోని మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత రాచకొండ శ్రీనివాస్‌రావు సహకారంతో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు క్లబ్ ప్రెసిడెంట్ చల్లా ప్రభాకర్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు బట్టు మధు, సత్యనారాయణరెడ్డి, రామస్వామి, శ్రీనివాస్‌రావు, ప్రధానోపాధ్యాయుడు శోభన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామస్వామి గట్టు జాతరకు రండి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం

మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ కొండారెడ్డి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 19 : హుజూర్‌నగర్ పరిధిలోని ఫణిగిరి గట్టుపై వేంచేసిన సీతారామచంద్ర స్వామి జాతరకు రావాలని ఆలయ ఈఓ కొండారెడ్డి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 19 : గురుకులాల్లో విద్యార్థినుల ఆత్మహత్యలపై మౌనం పాటిస్తూ సోమవారం స్థానిక 60 ఫీట్ల రోడ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మనోస్థైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నందిని, జయంతి, అఖల, నరసింహారావు, ప్రవీణ్, వినయ్, గోపి, అంజలి, శిరీష, భాగ్య, నిరోష, నవ్య, ప్రియాంక, మహేశ్వరి పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

మఠంపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం ఉదయం కిరాణం, జనరల్ ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకొనే హక్కు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకొను హక్కుకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, ఈఓ సిరికొండ నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలంలో పాల్గొనదలిచిన వారు టెండర్ షెడ్యూల్ ధర రూ.వెయ్యి చెల్లించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాగణంలో జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేరేడుచర్ల : మండలంలోని బూర్గులతండా పరిధిలో గల సోమప్ప ఆలయం వద్ద నిర్వహించే శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కొబ్బరికాయలు, సైకిల్ స్టాండ్ నిర్వహణకు నేడు 20న ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించినట్లు దేవాదాయ, ధర్మాదయ శాఖ మేనేజర్ కొంకపాక మృత్యుంజయశాస్త్రి, ఆలయ పూజారి ఇరువంటి శ్రీనివాస్‌శాస్త్రి తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు కొబ్బరికాయల వేలానికి రూ.5వేలు, సైకిల్ స్టాండ్ నిర్వహణకు రూ.3వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

మోతె, చిలుకూరు తాసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

సంఘమిత్ర

మోతె/చిలుకూరు, ఫిబ్రవరి 19 : మోతె తాసీల్దార్‌గా సంఘమిత్ర, చిలుకూరు తాసీల్దార్‌గా ధ్రువకుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి : ఎమ్మార్పీఎస్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19 : మిర్యాలగూడ– కోదాడ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నేరేడుచర్ల పట్టణంలోని చౌరస్తా వద్ద తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి అదే స్థలంలో ఏర్పాటు చేసేందుకు అనుమతివ్వాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు యడవల్లి అరుణ్ మున్సిపల్ అధికారులను కోరారు. నూతనంగా మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉబ్బపెల్లి సైదులు, ఇంజమూరి వెంకన్న, కార్తీక్, నవీన్, గురువయ్య, సైదులు, సుదర్శన్, వెంకన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలకు విరాళం

అర్వపల్లి, ఫిబ్రవరి 19 : అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం కమిటీ సభ్యులకు రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచార్యులు, ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సత్యం, మహేందర్, నసీర్‌గౌడ్, ఆలయ డైరెక్టర్ రేణుక పాల్గొన్నారు.

జగదాంబ మాత విగ్రహ ప్రతిష్ఠ

మఠంపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని బాడవతండాలో జగదాంబ మాత విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. రమేశ్ గిరిజి మహరాజ్ జునా అఖడ, వేద పండితుడు సముద్రాల సిద్ధార్థ ఆచార్యుల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జగన్‌నాయక్ భారతి, బాడవతండా మాజీ సర్పంచ్ గోవింద్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ బాలూనాయక్, వినాయక్, నాగమణి, శ్రీను, నాగ హంసాలి, భద్రూనాయక్, ధర్మనీబాయి పాల్గొన్నారు.

శంభులింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 19 : స్థానిక శంభులింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున పంచామృత అభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కంకుమ పూజల అనంతరం స్వామివారిని అర్చకులు కొంకపాక శివవిష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ పూలతో అలంకరించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బందితోపాటు భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

అర్వపల్లి, ఫిబ్రవరి 19 : ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, షీ టీమ్స్ ఇన్‌చార్జి, సూర్యాపేట డీఎస్పీ జి.రవి ఆధ్వర్యంలో సీఐ రఘువీరారెడ్డి, అర్వపల్లి ఎస్ఐ మహేంద్రనాథ్ సోమవారం కేజీబీవీ విద్యార్థులకు సైబర్ నేరాలు, షీ టీమ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల భద్రతపై పోలీస్ కళాబృందంతో అవగాహన కల్పించారు. మహిళల భద్రత, 100 డయల్ గురించి, సోషల్ మీడియా, సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నంబర్ 1930, సెల్‌ఫోన్‌తో కలిగే అనర్థాలు, విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిరీన్, షీ టీమ్ కానిస్టేబుల్ శివరాం, కళాబృందం పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఆర్పీలు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 19 : సూర్యాపేట నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను సూర్యాపేట పట్టణ మెప్మా రిసోర్స్‌పర్సన్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఆర్పీలు తమకు అప్పగించిన విధులను సక్రమగా నిర్వహిస్తూ వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తనకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీల యూనియన్ అధ్యక్షురాలు అన్నెపర్తి రాణి, ఆర్పీలు కోల మంగ, మంత్రాల పద్మ, గోనె విజయమ్మ, బీబీ, యల్లమ్మ, పద్మ పాల్గొన్నారు.

Canara Bank – రేవూర్ శాఖ
మెయిన్ రోడ్, రేవూర్ పిఓ, సూర్యాపేట జిల్లా-508206

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఈ క్రింద పేర్కొనబడిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు ఆభరణములను తాకట్టుపెట్టి ఋణము పొందినారు. అట్టి ఋణము నిర్ణీత గడువులో చెల్లించనందున వారికి మా వద్ద నమోదు చేయబడిన చిరునామాలకు నోటీసులు పంపించడమైనది. అయినను ఎటువంటి స్పందన లేనందున వేలం వేయుటకు నిర్ణయించబడినది. సదరు బంగారు ఆభరణములను ఎక్కడ ఎలా ఉన్నవి అలాగే అనే ప్రతిపదికపై తేది: 01.03.2024న శుక్రవారం సా. 04.00 గం॥లకు రేవూర్ శాఖ ఆవరణలో వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి కలవారు వేలమునందు పాల్గొనగలరు.

ఋణము తేది	అకౌంట్ నం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా
29-03-2023	180166133190	పల్లె నాగ సిద్దయ్య తండ్రి వెంకటయ్య, రామాపురం
02-09-2020	1664836002085	పి. వెంకటేశ్వర్ రావు తండ్రి సైదయ్య, రామాపురం
11-11-2020	1664836003057	తోడేటి వెంకటేశ్వర్లు తండ్రి కోటయ్య, గుడిమల్కాపురం
16-11-2020	1664836003081	బందారు వీరయ్య తండ్రి బందారు గురవయ్య, తమ్మారం
22-09-2020	1664836002532	గందారపు రాము తండ్రి గందారపు సాంబయ్య, వెల్లటూర్
21-09-2020	1664836002503	గందారపు రాము తండ్రి గందారపు సాంబయ్య, వెల్లటూర్

నిబంధనలు
1) ఏ నోటీసు లేకుండా, ఏకారణం చూపకుండా వేలం తేదీని పొడిగించుటకు, రద్దుచేయుటకు మరియు తగిన ధర రానిచో తిరిగి వేలం నిర్వహించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు.
2) వేలం పాటలో పాల్గొనదలచినవారు 01.03.2024 శుక్రవారం రోజున సా. 04.00 గం॥లలోగా 10,000/- రూపాయలు ధరావత్తుగా చెల్లించవలెను.
3) వేలంలో గెలిచిన పాటదారులు పాట మొత్తమును వేలం పూర్తి అయిన వెంటనే చెల్లించి వస్తువులను తీసుకుని వెల్లవలెను. లేనిచో చెల్లించిన ధరావత్తును స్వాధీనపరుచుకొనబడును.
4) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారికి పూచీ ఏమీలేదు.
5) ఇతర నియమ నిబంధనలు, షరతులకై బ్యాంకు మేనేజర్ గారిని లేదా సెల్: 7382932262ను సంప్రదించగలరు.
ముఖ్యగమనిక: 1) మేము పంపిన నోటీసు అందనివారు ఈ ప్రకటనను నోటీసుగా భావించి, వేలం తేదీలోగా బాకీ చెల్లించి మీ ఆభరణములను తీసుకొనగలరని విజ్ఞప్తి. లేనిచో తమ వస్తువులు వేలం వేయబడును.
2) ఖాతాదారులలో ఎవరైనా మరణించి ఉండిన వారి వారసులకు కూడా ఈ ప్రకటన పూర్వకముగా తెలియజేయడమైనదిగా భావించవలెను.
3) వేలం తరువాత బాకీ పూర్తిగా రద్దుగాని పక్షంలో మిగిలిన బాకీ పైకం కొరకు బాకీ దారునిపై లేదా వారసులపై చట్టరీత్యా చర్యతీసుకోబడును.

తేది: 19.02.2024, ప్రదేశం: రేవూర్, బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్,

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I KHADIR (Old Name) S/o.Lateef, R/o. H.No.1-7-34, Kummari Bazar, Suryapet-508213, Telangana, have change my name MOHAMMED ABDUL KHADEER (New Name) S/o.Lateef.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించి కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.)

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

చెరువు ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19 : మండలంలోని సోమారం, బూర్గులతండా ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు అక్రమణకు గురవుతుందని, దానిని అడ్డుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు వినతి పత్రం అందజేశారు. సర్వేనంబర్ 348లో 82.20 ఎకరాల విస్తీర్ణం ఉండగా ఆక్రమణకు గురవుతుందని 2011లో అప్పటి సర్పంచ్, ఎంపీటీసీ, రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆక్రమణ నిలిచిపోయిందన్నారు. తిరిగి మళ్లీ కొంతమంది జేసీబీల సాయంతో చెరువు భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాలోతు నాగు, మంజూ, రామ, గోవింద్, దాహుజా పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 19 : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి–అరుణకుమారి దంపతులు సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు 115 ఇంగ్లిష్, తెలుగు డిక్షనరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం దీప, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

అర్వపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని తిమ్మాపురం, లచ్చిరాంతండా ప్రాథమిక పాఠశాలలు, జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాగునీటి పంపులకు మరమ్మతులు చేపట్టాలి

- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేశ్‌బాబు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19 : మండలంలోని పాడైన బోర్లకు మరమ్మతులు చేపట్టాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు సోమవారం ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డిని వినతి పత్రంలో కోరారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతోపాటు రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత కారణంగా భూగర్భజలాలు అడుగంటి గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడిందని పేర్కొన్నారు. దాంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టి గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నాగారం, ఫిబ్రవరి 19 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని ఫణిగిరి స్టేజీ సమీపంలోని సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన చిరబోయిన నరేశ్ సొంత పని నిమిత్తం నాగారం మండల కేంద్రానికి వచ్చి తిరిగి బైక్‌పై తిరుమలగిరికి వెళ్తుండగా ఫణిగిరి స్టేజీ సమీపంలో శ్రీనివాస్ రైస్‌మిల్ సమీపంలో ట్రాలీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో నరేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.